గురువారం 09-5-2024

# ముందడుగు దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 329, పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD


మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయోచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..


Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com


# రాజన్న సన్నిధిలో ప్రధాని మోడీ

## క్యూలో వేచి ఉన్న భక్తులకు అభివాద ● ఆలయంవద్ద పోలీసులు భారీ భద్రత

**ముందడుగు వేములవాడ:**

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామిని ప్రధాని నరేంద్ర మోడీ బుధవారం దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజన్న ప్రధాన ఆలయంలో ప్రత్యేక నిర్వహించిన అనంతరం కోడె మొక్కులు కూడా మోడీ చెల్లించుకున్నారు. ఆలయంలోకి వస్తున్న సమయంలో ప్రధాని మోడీ క్యూలో వేచి ఉన్న భక్తులకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఈ సమయంలో ఆలయ అధికారులు, పూజారులు మోడీకి పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఆలయ ప్రధాన అర్చకులు ప్రధానిమోడీని శాలువాతో సత్కరించారు. అనంతరం వేద పండితుల ప్రత్యేక ఆశీర్వాదాలు తీసుకున్నారు. మోడీ రాకతో ఆలయంవద్ద పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు.ఆలయ దర్శనం అనంతరం వేములవాడలో నిర్వహించిన బహిరంగ సభతో పాటు కరీంనగర్ బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ కు మద్దతుగా ప్రచారంలో పాల్గొననున్నారు. నేడు సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా మోడీ వేములవాడ, వరంగల్‌లలో నిర్వహించే బహిరంగ సభలలో పాల్గొననున్నారు. తొలుత బండి సంజయ్ కు మద్దతుగా మోడీ బహిరంగ సభలో పాల్గొని ఆ తరువాత వరంగల్ బయలుదేరి వెళ్లనున్నారు. అక్కడ బీజేపీ ఎంపీ అభ్యర్థి ఆరూరి రమేష్‌కు ఎన్నికల బహిరంగ సభలో మోడీ పాల్గొని ప్రసంగిస్తారు.






## పసుపుబోర్డు పేరుతో ఇంకా మోసం చేస్తారా

### బిజెపి, భారాసపై రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు

**ముందడుగు నిజామాబాద్:**

నిజామాబాద్ ఎంపీగా పోటీ చేసినప్పుడు ఇచ్చిన హామీలను ఆ తర్వాత కవిత మరిచారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. పసుపుబోర్డు తెస్తానని చెప్పిన ధర్మపురి అర్వింద్ కూడా మోసం చేశారన్నారు. 2019లో రాజ్‌నాథ్‌సింగ్‌ను తీసుకొచ్చి పసుపుబోర్డుపై ప్రకటన చేయించిన అర్వింద్, ఇప్పుడు మోడీని తీసుకొచ్చి మళ్లీ అదే మాట చెప్పించారని ఎద్దేవా చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆర్మూర్‌లో నిర్వహించిన రోడ్ షోలో బిజెపి, భారాసపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఉత్తరాది రాష్ట్రాల్లో కూడా మోడీ ఇలాగే హామీ ఇచ్చి కాలయాపన చేస్తారా? అని ప్రశ్నించారు. జీవన్‌రెడ్డిని గెలిపిస్తే ఆర్మూర్‌ను అభివృద్ధిపథంలో ముందుంచుతానని హామీ ఇచ్చారు. చక్కెర కర్మాగారం తెరిపించేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందని, రూ.42 కోట్ల బకాయిలు చెల్లించేందుకు నిధులు విడుదల చేశామని సీఎం తెలిపారు.



## కేజ్రీవాల్ బెయిల్‌పై మే 10న తీర్పు

బెయిల్‌పై విడుదలైతే ఫైళ్లపై సంతకాలు చెయొద్దు పలు సూచనలు చేసిన సుప్రీంకోర్టు

వివరాలు 2లో

## తమ టీకాను వెనక్కి తీసుకుంటున్నాం

వివరాలు 2లో




## మోడీ పార్టీతో పైసా లాభం ఉందా

### పబ్లిక్ సెక్టార్ అంతా ప్రైవేటీకరణే నర్సాపూర్ రోడ్‌షోలో కేసీఆర్


**ముందడుగు మెదక్:**

దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఎజెండాలో ఎప్పటికి పేదల గోసలు, రైతుల బాధలుండవని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విమర్శించారు. నర్సాపూర్ రోడ్‌షోలో భాగంగా కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. మెదక్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'నరేంద్ర మోడీ పార్టీతో ఏమన్నా పైసా లాభమైనా ఉన్నదా? సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ ఏమైనా అయ్యిందా? మోడీ పాలనో రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే రూ.84కి పడిపోయింది. ఏ ప్రధానమంత్రి కాలంలో దిగజారనంత దిగజారిపోయింది. పెట్టుబడులు పోయాయి. పరిశ్రములు మూతపడ్డాయి. కార్మికులు రోడ్డునపడుతున్నరు. ఎల్ఐసీని ముంచే ప్రయత్నం చేస్తున్నరు. పబ్లిక్ సెక్టార్ అంతా ప్రైవేటీకరణ చేస్తున్నరు' అంటూ మండిపడ్డారు.



## వీడియో తీస్తుండగా అడవి ఏనుగు దాడి

వివరాలు 2లో




## ఓట్లు అమ్ముకోమంటూ.. ఊరంతా పోస్టర్లు

వివరాలు 3లో



## అన్ని వర్గాలలో జెడీకి పెరుగుతున్న ప్రజాదరణ

వివరాలు 4లో

ముందడుగు
గురువారం,
09-5-2024,
హైదరాబాద్

## కేజ్రీవాల్ బెయిల్‌పై

# మే 10న తీర్పు

**ముందడుగు ఢిల్లీ:**



ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ ఇచ్చే అంశంపై సుప్రీంకోర్టు మంగళవారం విచారణ జరిపిన సంగతి తెలిసిందే. ఇరుపక్షాల వాదనలు విన్న జస్టిస్ సంజీవ్ ఖన్నా ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది. దీనిపై మే 10వ తేదీన (శుక్రవారం) మధ్యంతర ఆదేశాలను వెలువరిస్తామని జస్టిస్ ఖన్నా నేడు వెల్లడించారు. అరెస్టును సవాల్ చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పైనా అదే రోజున వాదనలు వింటామని తెలిపారు.

ఈ కేసులో మార్చి 21న ఈడీ అధికారులు ఢిల్లీ సీఎంను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అరెస్టు పిటిషన్‌పై విచారణకు సమయం పట్టే అవకాశం ఉన్నందున.. మధ్యంతర బెయిల్ ఇచ్చే అంశాన్ని పరిగణిస్తామని ఇటీవల అత్యున్నత న్యాయస్థానం వెల్లడించింది. ఈ క్రమంలోనే మంగళవారం దీనిపై విచారణ జరిపింది. ఒకవేళ, ఈ కేసులో కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తే.. సీఎం బాధ్యతల్లో అధికారిక విధులు నిర్వర్తించేందుకు అనుమతించబోమని ధర్మాసనం స్పష్టం చేసింది. బెయిల్‌పై విడుదలైతే ఫైళ్లపై సంతకాలు చేయొద్దని తెలిపింది.

# తమ టీకాను వెనక్కి తీసుకుంటున్నాం

## కొవిడ్ వ్యాక్సిన్‌పై ఆస్ట్రాజెనెకా ప్రకటన

**ముందడుగు జాతీయం:**

కరోనా వైరస్ నివారణ కోసం తాము ఉత్పత్తి చేసిన కొవిడ్ 19 వ్యాక్సిన్లను మార్కెట్ నుంచి వెనక్కు తీసుకుంటున్నట్టు ఆస్ట్రాజెనెకా ప్రకటించింది. మార్కెట్‌లో అప్‌డేటెడ్ టీకాలు పెద్ద సంఖ్యలో అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. తమ వ్యాక్సిన్ వ్యాక్స్‌జెవ్రియాకు గిరాకీ తగ్గిందని పేర్కొంది. ఇప్పటికే దీని తయారీ, పంపిణీని నిలిపివేసినట్లు వెల్లడించింది. ఆక్స్ ఫర్డ్ విశ్వవిద్యాలయంతో కలిసి ఆస్ట్రాజెనెకా కొవిడ్ వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ టీకాపై న్యాయస్థానాల్లో విచారణ జరుగుతోంది. దీని వల్ల దుష్ప్రభావాలు తలెత్తినట్లు పలువురు కోర్టును ఆశ్రయించారు. దీనిపై వివరణ ఇచ్చిన ఆస్ట్రాజెనెకా తమ వ్యాక్సిన్ వల్ల చాలా అరుదుగా సైడ్ ఎఫెక్ట్స్ ఉండొచ్చని తెలిపింది. ఈ తరుణంలో వెనక్కు తీసుకుంటున్నట్టు ప్రకటించడం ప్రాధాన్యం సంతరించుకుంది.




## మూడు గ్రామాల్లో ఓటు వెయ్యని గ్రామస్థులు

### హామీలను నెరవేర్చలేదని ఓటుకు ముందుకు రాలే

**ముందడుగు గుజరాత్:**



లోక్‌సభ ఎన్నికల మూడో విడతలో భాగంగా గుజరాత్‌లోని మూడు గ్రామాల్లో ఒక్కరు కూడా ఓటు హక్కును వినియోగించుకోలేదు. మరికొన్ని గ్రామాల్లో చాలా తక్కువ మంది ఓటు వేశారు. గుజరాత్‌లోని బీజేపీ ప్రభుత్వం ఆయా గ్రామాలకు సంబంధించి గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో ఆ గ్రామాల ప్రజలంతా పోలింగ్‌ను బహిష్కరించాలని నిర్ణయించుకుని ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. ఓటింగ్‌ను సంపూర్ణంగా బహిష్కరించిన గ్రామాల్లో బరూచ్ జిల్లాలోని కేసర్ గ్రామం, సూరత్ జిల్లాలోని సనధారా గ్రామం, బనస్కాంత జిల్లాలోని భఖారీ గ్రామం ఉన్నాయి.

అదేవిధంగా జునాగఢ్ జిల్లాలోని భత్గమ్ గ్రామంలో , మహిసాగర్ జిల్లాలోని బదోలీ, కుంజర గ్రామంలో చాలా కొద్ది మంది మాత్రమే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తమ గ్రామాల మధ్య నదిపై వంతెన నిర్మిస్తామని హామీ ఇచ్చి మాట నిలబెట్టుకోనందుకు కొన్ని గ్రామాల వాళ్లు, తమ గ్రామాన్ని విభజించినందుకు నిరసనగా కొన్ని గ్రామాలవాళ్లు ఇలా ఓటింగ్‌ను బహిష్కరించారు.

## కదులుతున్న రైల్లో భార్యకు

# ట్రిపుల్ తలాక్

### భార్య నిలదీయడంతో రైలు దూకి పరార్

**ముందడుగు ఉత్తరప్రదేశ్:**



ఒక వ్యక్తి కదులుతున్న రైల్లో తన భార్యకు ట్రిపుల్ తలాక్ చెప్పి పరారైన ఘటన కలకలం రేపింది. భార్య నిలదీయడంతో జుట్టు పట్టుకుని ఆమెను కొట్టి, తర్వాత రైలు దూకి పారిపోయాడు. ఈ విచిత్ర ఘటన ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో జరిగింది. బాధితురాలు తనకు న్యాయం చేయాలంటూ సీఎం యోగిని వేడుకోవడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. బాధిత మహిళ ఫిర్యాదుతో నిందితుడి సహా నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. భోపాల్‌లోని ఓ ప్రైవేట్ సంస్థలో కంప్యూటర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న అర్షద్ అనే వ్యక్తి ఈ ఏడాది జనవరి 12న రాజస్థాన్‌లోని కోటాకు చెందిన గ్రాడ్యుయేట్ అఫ్సానాను వివాహం చేసుకున్నాడు. మ్యాట్రిమోనియల్ సైట్‌లో కలుసుకున్న ఈ జంట ఆ తర్వాత వివాహబంధంతో ఒక్కటయింది. ఇక పెళ్లయిన తర్వాత భర్త, అత్తమామలు అఫ్సానాను అదనపు కట్నం కోసం వేధించడం మొదలెట్టారు.



# వీడియో తీస్తుండగా అడవి ఏనుగు దాడి

### ఏనుగుల దాడిలో వీడియో జర్నలిస్టు మృతి

**ముందడుగు కేరళ:**

అడవి ఏనుగుల మంద దాడిలో ఓ వీడియో జర్నలిస్టు మరణించాడు. కేరళ రాష్ట్రంలోని పాలక్కాడ్ జిల్లా కొట్టెకాడ్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. కొట్టెకాడ్‌లో ఓ ఏనుగుల మంద నదిని దాటుతుండగా ఆ దృశ్యాలను తన కెమెరాలో బంధించాలని వీడియో జర్నలిస్టు ఏవీ ముకేశ్ భావించాడు.

**ఆ మేరకు కెమెరా సెట్ చేసు**

ని వీడియో తీస్తుండగా ఓ అడవి ఏనుగు అతడి వైపు దూసుకొచ్చింది. వచ్చిరావడంతోనే అతడిపై దాడిచేసింది. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన ముకేశ్‌ను తన వెంట ఉన్నవాళ్లు పాలక్కాడ్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆయన మరణించాడు.

## ఈవీఎంకు హారతి ఇచ్చిన మహిళా కమిషన్ చైర్‌పర్సన్

**ముందడుగు మహారాష్ట్ర:**

మహారాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రూపాలి చకంకర్ ఈవీఎంకు హారతి ఇచ్చారు. అనంతరం ఓటింగ్ ప్రక్రియను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎన్సీపీ నాయకురాలు కూడా పాల్గొన్నారు. ఈ హారతికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనతో ఎన్నికల అధికారి ఫిర్యాదుతో రూపాలీ చకంకర్‌పై సింహగడ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. మహారాష్ట్రలోని బారామతి లోక్‌సభ నియోజకవర్గంలో నిన్న పోలింగ్ కేంద్రంలో ఈ సంఘటన జరిగింది. బారామతి నియోజకవర్గంలో శరద్ పవార్ కుమార్తె సుప్రియా సూలే, అజిత్ పవార్ భార్య సునేత్రా పవార్ బరిలో ఉన్నారు. ఇక ఈ నియోజకవర్గం పరిధిలో మొత్తం 2,561 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 23.72 లక్షల మంది ఓటర్లు ఉన్నారు.



ముందడుగు
గురువారం, 09-5-2024, హైదరాబాద్

# బాలికను కరిచిన కుక్క యజమాని అరెస్ట్

## కుక్కలను చూసుకునే మరో ఇద్దరిపై కేసు

**ముందడుగు తమిళనాడు:**

ఐదేళ్ల బాలిక పై రెండు రాట్ వీలర్ కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. దాడి చేసిన కుక్కల యజమానిపై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. కుక్కలను చూసుకునే మరో ఇద్దరిని ఈ కేసులో నిందితులుగా చేర్చారు. పోలీసులు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నైలోని థౌజండ్ లైట్స్ ఏరియాలోని పబ్లిక్ పార్కులో ఈ ఘటన జరిగింది.



పార్కులో యజమాని, కుక్కలను విడిచిపెట్టడంతో కుక్కలు బాలికపై దాడి చేశాయని అన్నారు. బాలిక తల్లిదండ్రులు ఆమెను రక్షించడాని కిఅప్రమత్తం చేసే వరకు యజమాని జోక్యం చేసుకోలేదని ఆరోపించారు. బాలిక తండ్రి పార్కులో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడని తాము యజమానిని అరెస్టు చేశామని తెలిపారు. కుక్కలను సంరక్షిస్తున్న మరో ఇద్దరిపై కేసు నమోదు చేసామని పోలీస్ అధికారి శేఖర్ దేశ్ముఖ్ తెలిపారు.

# చికెన్ షవర్మా తిని యువకుడు మృతి

## స్ట్రీట్ ఫుడ్ జాగ్రత్తగా ఉండాలన్న వైద్యులు

**ముందడుగు ముంబాయి:**

పాడైపోయిన చికెన్ షావర్మా తిని 19 ఏళ్ల యువకుడు మృతి చెందాడు. ఇదే షావర్మా తిన్న మరో ఐదుగురు కూడా ఫుడ్ పాయిజన్ కారణంగా ఆసుపత్రిలో చికిత్స పొందతున్నారు. మే 3న ప్రతిమేశ్ భోక్సే అనే యువకుడు తన స్నేహితులతో కలిసి ఓ షాపులో షావర్మా తిన్నాడు. ఆ తర్వాత కడుపునొప్పితో వాంతులు చేసుకున్నాడు. మరుసటి రోజు వాంతులు ఆగక పోవడంతో అతని తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు.

ముంబైలో ఈ దారుణం జరిగింది.



అక్కడ చికిత్స పొందతూ ప్రతిమేశ్ మృతి చెందాడు. ఈ ఘటనపై ప్రతిమేశ్ భోక్సే కుటుంబ సభ్యులకు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో షవర్మా షాపు నడుపుతున్న ఆనంద్ కాంబ్లే, మహ్మద్ అహ్మద్ రెజా షేక్ అనే ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. షావర్మా శాంపిల్‌ను ల్యాబ్ కు పంపారు. స్ట్రీట్ ఫుడ్ తినేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలని వైద్యులు చెబుతున్నారు.

# ఓటు వేశారు.. వజ్రాల ఉంగరాలు గెలిచారు

- ఓటర్లకు లక్కీ డ్రాలో ఖరీదైన బహుమతులు
- ఓటింగ్ శాతం పెంచేందుకు వినూత్న కార్యక్రమం




**ముందడుగు మధ్యప్రదేశ్:**

మధ్యప్రదేశ్ భోపాల్ జిల్లా ఎన్నికల అధికారులు లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు వినూత్న కార్యక్రమం చేపట్టారు. ఓటర్లకు లక్కీ డ్రా నిర్వహించి ఖరీదైన బహుమతులు అందజేశారు. మంగళవారం జరిగిన పోలింగ్‌లో నలుగురు ఓటర్లు ఏకంగా వజ్రాల ఉంగరాలు గెలుచుకున్నారు. ఓటర్లు వేలికి సిరా గుర్తు చూపించి తమ పేరు, ఫోన్ నంబరు వంటి వివరాలను టోకెన్‌పై రాసి లాటరీ బాక్సులో వేయాలని సూచించారు. ఇందుకు స్థానికుల నుంచి విశేష స్పందన లభించింది.

అనేకమంది ఓటర్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. పోలింగ్ రోజున ఉదయం 10, మధ్యాహ్నం 2, సాయంత్రం 6 గంటలకు మూడుసార్లు డ్రా తీశారు. పోలింగ్ కేంద్రానికి ముగ్గురు చొప్పున విజేతలుగా ప్రకటించారు. వీరిలో మళ్లీ మెగా డ్రా నిర్వహించి నలుగురు ఓటర్లకు డైమెండ్ ఉంగరాలు అందజేశారు. మిగతావారికి మిక్సర్లు, వాటర్ కూలర్లు వంటి బహుమతులు ఇచ్చారు. కన్సోలేషన్ కింద కొందరికి టోపీలు, వాటర్ బాటిళ్లు, టీషర్ట్ కానుకలిచ్చారు. ఓటరు అవగాహన కార్యక్రమం కింద ప్రైవేటు సంస్థలు ఇచ్చిన విరాళాలతో ఈ లక్కీ డ్రా బహుమతులను అందజేసినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు.

# భారీగా రేట్లు పెంచేసిన ప్రైవేటు ట్రావెల్స్

- ఇష్టారీతిగా మూడు, నాలుగు రెట్లు పెంచేశారు
- ప్రత్యేక సర్వీసులను నడుపుతున్న రైల్వే, ఆర్టీసీ
- ఎన్నికల ఎఫెక్ట్.. ఖాళీ అవుతున్న భాగ్యనగరం

**ముందడుగు హైదరాబాద్**

లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్ సహా తెలంగాణలో వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ ఆంధ్రప్రదేశ్ వాసులు ఓటు వినియోగానికి స్వంత గ్రామాలకు పయనం అవుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లో మే 13న పోలింగ్ జరుగుతోంది. అదే రోజు తెలంగాణలో లోక్ సభ ఎన్నికలు జరగనుండగా.. ఏపీలో అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికలను మొత్తం ఒకే విడతలో నిర్వహిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలు, అంతకుముందు రెండు రోజులు వారాంతపు సెలవులు కూడా కావడంతో ఆంధ్రా ప్రజలు తమకు ఓటు హక్కు ఉన్న సొంతూర్లకు పయనం అవుతున్నారు. మామూలు రోజుల్లో అయితే, హైదరాబాద్ నుంచి శుక్ర, శని, ఆదివారాల్లో ఆంధ్రప్రదేశ్ లోని వివిధ ప్రాంతాలకు 2 వేలకు పైగా ప్రైవేటు, ఆర్టీసీ బస్సులన్నీ దాదాపు 100 శాతం ఆక్యుపెన్సీతో నడుస్తాయి. కానీ గత వారం రోజులుగా ప్రతిరోజూ బస్సులు ఫుల్ ఆక్యుపెన్సీతో ఉన్నట్లుగా ట్రావెల్స్ వర్గాలు చెబుతున్నాయి. ఇక రానున్న ఐదారు రోజుల్లో అయితే, రిజర్వేషన్లకు ఫుల్ డిమాండ్ ఉందని చెబుతున్నారు. అటు ఏపీ వైపు వెళ్లే అన్ని రైళ్లలోనూ టికెట్లన్నీ బుక్ అయి.. వందల కొద్దీ వెయిటింగ్ లిస్ట్ లు ఉన్నాయి. ఈ రద్దీ కారణంగా ఆర్టీసీ, రైల్వే యాజమాన్యం ప్రత్యేక సర్వీసులను నడుపుతోంది.



### రేట్లు పెంచేసిన ప్రైవేటు ట్రావెల్స్

పోలింగ్ సందర్భాన్ని ప్రైవేటు ట్రావెల్స్ సంస్థలు క్యాష్ చేసుకుంటున్నాయి. రిజర్వేషన్లకు బాగా డిమాండ్ ఉండడంతో ఒక టిక్కెట్ ధరను ఇష్టారీతిన మూడు నాలుగు రెట్లు పెంచేశారు. రూ.500 టిక్కెట్ రూ.1500 వరకూ ఉంటోంది. విజయవాడ వెళ్లాలంటే రూ.వెయ్యి దాకా టికెట్ ఉంటోందని ప్రయాణికులు వాపోతున్నారు.

ముందడుగు

గురువారం, 09-5-2024, హైదరాబాద్

# ఓట్లు అమ్ముకోమంటూ.. ఊరంతా పోస్టర్లు

- ఎన్నికల తాయిలాలకు మేము అమ్ముడుపోము
- గ్రామ అభివృద్ధే మా లక్ష్యం అంటున్న గ్రామస్థులు

**ముందడుగు నెల్లూరు:**

నెల్లూరు జిల్లాలోని ఓ గ్రామ ప్రజలు మాత్రం తమ ఓటు అమ్ముకోబోమంటున్నారు.. వారు ప్రతిజ్ఞ బూనడమే కాదు.. ఆ ఊరిలోకి వచ్చేవారికి అందరికీ తెలియాలన్న ఉద్దేశంతో.. ఊరంతా గోడ పత్రాలు.. ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. చేజర్ల మండలంలోని కాకివాయి గ్రామంలో ప్రజలంతా ఒకే నిర్ణయం తీసుకొని.. గ్రామ అభివృద్ధికి సహకరిస్తుంటారు. గతంలో పలుమార్లు ఈ గ్రామంలో ఎన్నికలు లేకుండా సర్పంచులు ఎన్నుకున్నారు. ప్రస్తుతం అసెంబ్లీతో పాటు, లోక్‌సభ ఎన్నికలు రావడంతో తాము ఓట్లు అమ్ముకోబోమంటూ.. గ్రామస్తులు.. ఊరంతా వేసిన గోడపత్రాలు.. ఫ్లెక్సీలు ఆకట్టుకుంటున్నాయి. మా గ్రామంలో ఓట్లు అమ్మబడవు.. మీకు అన్ని విధాలా సహకరిస్తాం..




మీరు కూడా మా గ్రామ అభివృద్ధికి సహకరించాలని గ్రామస్తులందరూ తమ ఇంటి ముందు గ్రామాల్లో గోడపత్రాలను ఏర్పాటు చేశారు.. మా గ్రామ అభివృద్ధే మా లక్ష్యం ఎన్నికల్లో మేం ఎలాంటి తాయిలాలకు మా ఓట్లు అమ్ముకోబోము.. మా గ్రామ అభివృద్ధికి ఎవరైతే సహకరిస్తారో వారికే మా ఓట్లు అంటూ గ్రామంలో ప్రతి ఇంటి ముంది నా ఓటు అమ్మకానికి లేదు అనే గోడ పత్రాన్ని అంటించారు. ఈ నెల 13వ తేదీన జరుగనున్న ఎన్నికల కోసం సృజనాత్మక వ్యక్తీకరణ ద్వారా ఓటు ప్రాముఖ్యతను గ్రామస్తులకు వివరిస్తున్నారు..





# అన్ని వర్గాలలో జెడీకి పెరుగుతున్న ప్రజాదరణ

**ఉత్తర విశాఖలో జెడీతో నడుస్తున్న జనం • పూర్తి మద్దతు తెలుపుతున్న ఓటర్లు**

**ముందడుగు విశాఖపట్నం:**

ఉత్తర విశాఖలో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ సిబిఐ జెడీ లక్ష్మినారాయణకు అన్ని వర్గాల నుంచి మద్దతు పెరుగుతోంది. మర్రిపాలెం నుండి ముస్లిం మైనార్టీ వర్గాలకు చెందిన మహిళలు జై భారత్ పార్టీలో చేరి విశాఖ నార్త్ అసెంబ్లీ అభ్యర్థి జేడీ లక్ష్మినారాయణకు తమ పూర్తి మద్దతు తెలియజేశారు. ఓజర్లకు డమ్మీ ఈవిఎంలు చూపించి ఓటు ఎలా వేయాలో అవగాహన కల్పించారు. ఓటు వేసేటప్పుడు ఆలోచించి వేయాలని తమ దగ్గర అక్రమంగా సంపాదించిన డబ్బులు లేవని తాను ఓట్లు కొనలేనని చెప్పారు. ఓట్లు కొనే ఉద్దేశం తనకు లేదని అలాగే మీరు కూడా ఓటుకు అమ్ముడుపోవద్దు. మీ జీవితాలను తాకట్టు పెట్టొద్దు అన్నారు. వెయ్యి రూపాయలకు, రెండు వేలకు ఓటు అమ్ముకుంటే ఐదు సంవత్సరాల పాటు వారు చేసే అక్రమాలను దౌర్జన్యాలను భరించాల్సిన వస్తుంది అన్నారు. మీకు మిమ్ముల రక్షించే రక్షకులు కావాలో, భక్షకులు కావాలో ఆలోచించి టార్చ్ లైట్ పై ఓటు వేసి తనకు మద్దతు తెలియజేయాలని అన్నారు. తాను గెలిచిన తర్వాత మీ అందరి సమస్యలు పరిష్కరించి మంచి భవిష్యత్తు కల్పిస్తానని హామీ ఇచ్చారు.

### రోజురోజుకు పెరుగుతున్న మద్దతు

ఉత్తర విశాఖలో మాజీ జెడీ లక్ష్మినారాణ ప్రచారానికి మహిళలు, విద్యావంతులు, యువత నుంచి విశేష అదరణ లభిస్తోంది. లక్ష్మీనారాయణ గెలుపు కోసం విద్యావంతులు, యువత స్వతంత్రంగా భారీగా తరలివస్తున్నారు. ధన రాజకీయాలకు కుల రాజకీయాలకు స్వస్తి పలకాలని ఉత్తర నియోజకవర్గంలో పెద్ద ఎత్తున జేడీకి మద్దతు పెరిగింది. నిస్వార్థపాలనకు నిజాయితీ పాలనకు నిలువుటద్దంలా ప్రజా సమస్యలపై అనునిత్యం పోరాటం చేస్తున్న జేడీ లక్ష్మీనారాయణ చట్టసభలలో గెలిపిస్తే మరింత మంది యువతకు పేదలకు న్యాయం చేకూరుతుందని భావిస్తున్నారు. ఉత్తర నియోజకవర్గంలో లక్ష్మీనారాయణ విస్తృత ప్రచారాన్ని నిర్వహించడంతో మురికివాడల ప్రాంతాలలో సైతం ప్రజల మద్దతు లభిస్తోంది.

# బరువు తగ్గాలా... వీటికి దూరంగా ఉండండి

**వ్యాయామంతో పాటు ఆహారంపై కంట్రోల్ . అధిక బరువుతో అనారోగ్య సమస్యలు**

**ముందడుగు ఆరోగ్యం**

ప్రస్తుత రోజుల్లో ఊబకాయం అతి పెద్ద సమస్యగా మారింది. ఆకలిగా ఉందని ఎప్పుడు పడితే అప్పుడు, ఏది పడితే అది తినే వారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుంది. అతిగా తింటూ, ఎలాంటి శారీరక శ్రమ చేయకుంటే ఖచ్చితంగా బరువు పెరుగుతారు. బరువు తగ్గాలంటే మాత్రం కొన్ని ఆహారాలకు దూరంగా ఉండాలని వైద్య నిపుణులు చెపుతున్నారు.

కొందరు జెనెటిక్స్ గా బరువు పెరిగితే.. మరికొంతమంది మాత్రం తినడం వల్ల బరువు పెరుగుతారు. చాలా మంది హెవీగా తిని ఎలాంటి వ్యాయామం చేయకుండా ఉంటారు. దీనివల్ల శరీర బరువు బాగా పెరుగుతుంది. కానీ బరువు పెరగడం వల్ల ఎన్నో అనారోగ్య సమస్యలు వస్తాయి. మరి బరువు పెరగకుండా ఉండటానికి ఎలాంటి ఆహారాలకు దూరంగా ఉండాలో ఒకసారి తెలుసుకుందాం.

### స్వీట్స్

స్వీట్స్ ను ప్రతి ఒక్కరూ ఎంతో ఇష్టంగా తింటుంటారు. చాలా మందికి ఉదయం, సాయంత్రం వేళల్లో స్వీట్లను తినే అలవాటు పక్కాగా ఉంటుంది. కానీ స్వీట్లు ఆరోగ్యానికి అంత మంచివి కాదు. ప్రతి రోజూ మీరు స్వీట్లను తింటే బ్లడ్ షుగర్ పెరగడంతో పాటుగా బరువు కూడా బాగా పెరుగుతారు. మీరు బరువు తగ్గాలనుకుంటే మాత్రం స్వీట్లను తినడం మానేయాలి.

### ఆలుగడ్డ

ఆలుగడ్డ కూడా మీరు బరువు పెరగడానికి దారితీస్తుంది. అవును బంగాళదుంప ఫ్రైస్, బంగాళాదుంప చిప్స్, సమోసాలు అంటూ బంగాళాదుంపను వివిధ మార్గాల్లో తింటే కూడా మీ బరువు మరింత పెరుగుతుంది. బంగాళాదుంపల్లో కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి మీ బరువను పెంచుతాయి. అందుకే వెయిట్ లాస్ అవ్వాలనుకుంటే వీటిని మాత్రం తినకండి.

### జంక్ ఫుడ్స్

జంక్ ఫుడ్స్, ఫాస్ట్ ఫుడ్స్ బలే టేస్టీగా ఉంటాయి. అందుకే చాలా మంది ప్రతి రోజూ పిజ్జా, బర్గర్స్ వంటి జంక్ ఫుడ్స్ ను ప్రతిరోజూ తింటుంటారు. కానీ ఈ ఆహార పదార్థాలను ఎక్కువగా తింటే బరువు పెరిగిపోతారు. వీటిని తింటే మీరు బరువు తగ్గే ప్రసక్తే ఉండదు.

### శీతల పానీయాలు

ముందే ఎండాకాలం. దాహాన్ని తీర్చుకోవడానికి చాలా మంది ప్రతిరోజూ కోకాకోలా, సోడాలు వంటి శీతల పానీయాలను ఎక్కువ మోతాదులో తాగుతుంటారు. కానీ ఇవి ఆరోగ్యానికి అంత మంచివి కావు. ఇవి ఆరోగ్యాన్ని పాడు చేయడమే కాకుండా మీ బరువును కూడా బాగా పెంచుతాయి. అందుకే బరువు తగ్గాలనుకుంటే మాత్రం వీటిని అస్సలు తాగకండి.

### చాక్లెట్

చాక్లెట్ చాలా మందికి ఇష్టం. వీటిని ఆడవాళ్లు ఎంతో ఇష్టంగా తింటుంటారు. ఒకేసారి వీటిని చాలా కొనేసి వీలున్నప్పుడల్లా తింటుంటారు. కానీ చాక్లెట్ ను ఎక్కువగా తినడం వల్ల మీరు విపరీతంగా బరువు పెరిగిపోతారు.

